## క్లుప్తంగా

### రీసర్వే పరిశీలన



**కోవూరు :** కోవూరులో ప్రస్తుతం జరుగుతున్న రీసర్వేను తహసీల్దార్ నిర్మలానందబాబా బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. సర్వేయర్ బృందం, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

### బాలికలకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ నిర్మల

**కొడవలూరు :** మండలంలోని రెడ్డిపాళెం జెడ్పీ హైస్కూల్‌లో కిశోర బాలికలకు కెరీర్ గైడెన్స్‌పై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.నిర్మల బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కలిగి ఉండాలన్నారు. లైంగిక వేధింపులకు గురవుతున్నట్లు సందేహముంటే వెంటనే 1098, 108, 100 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సునీత, మంజుల, సుస్మిత, శీనమ్మ పాల్గొన్నారు.

**పెయ్యలపాళెంలో..**



మండలంలోని పెయ్యలపాళెం అరుంధతీయవాడలో సూపర్‌వైజర్ టి.నాగభూషణమ్మ ఆరేళ్లలోపు పిల్లల్లో గ్రోత్ మానిటరింగ్, ఎర్లీ చైల్డ్ ఎడ్యుకేషనలపై బుధవారం తల్లులకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్త కె.చెంచమ్మ, సహాయకురాలు ఇందిరమ్మ పాల్గొన్నారు.

### ముస్లింలకు న్యాయం జరగాలి



శ్మశాన స్థల ఆక్రమణపై తహసీల్దార్‌కు వివరిస్తున్న ముస్లిం నేతలు

**తోటపల్లిగూడూరు :** ముస్లింల శ్మశాన స్థలాన్ని ఆక్రమించుకునే ప్రయత్నం సరికాదని, తమకు తగిన న్యాయం జరగాలని జిల్లా ముస్లిం సంఘ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘ జిల్లా నేతలు తహసీల్దార్ కృష్ణప్రసాద్‌ను బుధవారం కలిసి పరిస్థితిని వివరించారు. మండలంలోని ఈదూరు గ్రామంలో ఏళ్లుగా 96 సెంట్లలో శ్మశాన వాటిక ఉందని, గత కొన్నేళ్లుగా పలురకాలుగా ఆక్రమణలకు గురై నేటికి 30 సెంట్లు మాత్రమే మిగిలి ఉందన్నారు. అయితే ఇందులో కొంత భాగంలో స్థానిక టీడీపీ నేతలు వాటర్ ప్లాంట్ నిర్మాణానికి ఇటీవల శ్రీకారం చుట్టడంతో స్థానిక ముస్లింలు అడ్డుకున్నట్లు తెలిపారు. దీనిపై అధికార పార్టీ నేతలు, స్థానిక ముస్లింల మధ్య వివాదం ఏర్పడిందని, విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్సై వీరేంద్రబాబు, ముస్లిం సంఘ జిల్లా నేతలు, స్థానిక ముస్లింలు పాల్గొన్నారు.

### రైల్లోంచి పడి వ్యక్తి మృతి

**కొడవలూరు :** రైల్లో నుంచి పడి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని కొడవలూరు, తలమంచి రైల్వేస్టేషన్‌ల మధ్య బుధవారం చోటుచేసుకుంది. మృతుడికి 30–35 సంవత్సరాల మధ్య వయస్సు ఉంటుందని, నలుపు, తెలుపు చెక్స్ కలిగిన చొక్కా ధరించి ఉన్నాడని రైల్వే ఎస్సై అరుణ తెలిపారు. ఏ రైలు నుంచి పడ్డారన్న విషయం తెలియరాలేదన్నారు. మృతుడ్ని గుర్తిస్తే 94406 27648 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.



# అటకెక్కిన యునాని వైద్యం

- పీహెచ్‌సీలో భవనం కేటాయింపు
- ప్రస్తుతం శిథిలావస్థలో ఉన్న వైనం



పీహెచ్‌సీలో శిథిలావస్థకు చేరిన యునాని భవనం

**పొదలకూరు :** ఆయుష్‌లో అంతర్భాగమైన యునాని వైద్యం ఇక్కడ పదేళ్లుగా అటకెక్కింది. మండలంలోని మహ్మదాపురం పీహెచ్‌సీలో ఓ భవనాన్ని యునాని వైద్యశాలకు గతంలో కేటాయించారు. అయితే యునాని వైద్యశాలను నిలిపివేయడంతో ఆ భవనం నిరుపయోగంగా మారింది. ప్రస్తుతం భవనం శిథిలావస్థకు చేరుకుంది. జిల్లాలో యునాని వైద్యానికి మంచి ఆదరణ ఉంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ఆత్మకూరు, బుచ్చిరెడ్డిపాళెం, నెల్లూరు నగరంలో జూబ్లీ ఆస్పత్రి, వెంకటాచలం, కసుమూరు, మహిమలూరు తదితర ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేశారు. అయితే మహ్మదాపురంలో మాత్రం ఎన్‌ఆర్‌హెచ్‌ఎం(నేషనల్ రూరల్ హెల్త్ మిషన్) కింద ఏర్పాటు చేసి కొంతకాలం నిర్వహించారు. ఇక్కడ కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగులను సైతం నియమించారు. అయితే ఎన్‌ఆర్‌హెచ్‌ఎం నుంచి నిధులు ఆగిపోవడంతో అప్పట్లో యునాని వైద్యాన్ని నిలిపివేశారు. తర్వాత ఎవరూ పట్టించుకోకపోవడంతో పదేళ్లుగా యునాని వైద్యం చుట్టుపక్కల గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అందుబాటులో లేకుండాపోయింది. జిల్లాలో మిగిలిన ప్రాంతాల్లో ఇప్పటికీ పీహెచ్‌సీల్లో యునాని వైద్యశాలలను నిర్వహిస్తూ ప్రజలకు సేవలను అందిస్తున్నారు. ఈ ఆస్పత్రుల్లో ఉచితంగా హెర్బల్ మెడిసన్స్‌ను అందజేస్తున్నారు.

**మంచి ఆదరణ**

ఆయుష్‌లో భాగమైన యునాని వైద్యాన్ని నమ్మేవారు కూడా ఉన్నారు. యునాని వైద్యం పరిశుభ్రమైన తాగునీటిని ఉపయోగించడం, స్వచ్ఛమైన గాలిని పీల్చుకోవడం, తాజాగా ఉన్న ఆహారాన్ని తీసుకోవడం వంటి చిట్కాలతో వ్యాధులను నయం చేస్తుంది. అంతేకాక మందులు దాదాపుగా ఆయుర్వేదాన్ని పోలి ఉంటాయి. యునానిలో హెర్బల్ మెడిసన్స్‌ను వ్యాధిగ్రస్తులకు అందజేస్తారు. మూలికా వైద్యంలో కడుపునొప్పి, అజీర్ణం, విరేచనాలు, చర్మం, కాలేయ సమస్యలు, రోగ నిరోధక శక్తిని పెంపొందించడం, జీవన శైలిని మెరుగుపరచడం వంటి వాటికి ప్రధానంగా మందులను అందజేస్తారు. గత ప్రభుత్వంలో ఆయుర్వేదం, యునాని మందులను కేరళ రాష్ట్రం నుంచి దిగుమతి చేసుకుని అందజేసేవారు.

# పలువురికి ప్రసన్న పరామర్శ



ఇందుకూరుపేట : గంగపట్నంలో దామోదర్ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ప్రసన్న



కొడవలూరు: హరిధర్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రసన్న

**ఇందుకూరుపేట :** మండలంలోని గంగపట్నం, మైపాడు గ్రామాల్లో మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పలు కుటుంబాలను బుధవారం పరామర్శించారు. రాయసం దామోదర్‌రావు తల్లి, విశ్రాంత హిందీ ఉపాధ్యాయిని సీతారామమ్మ వయోభారంతో రెండు రోజుల క్రితం మృతిచెందారు. ఈ నేపథ్యంలో వారి స్వగ్రామం గంగపట్నం గ్రామానికి ప్రసన్న చేరుకుని కుటుంబసభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. అలాగే మైపాడు పాళెంలో కొండూరు మురళీ, కటారి జయరామయ్య, పరదేశి పెద్దబాబులు ఇటీవల మృతిచెందారు. దీంతో వారి నివాసాలకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, డీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ శ్రీహరికోట జయలక్ష్మి, మైపాడు సర్పంచ్ సంగం వెంకయ్య, గజ్జల లింగారెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీహరికోట ప్రసాద్, రూప్ కుమార్‌రెడ్డి, పంబాల జనార్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- **కొడవలూరు:** మండలంలోని రెడ్డిపాళెనికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు నీలకంఠం శ్రీధర్‌రెడ్డి సోదరుడు హరిధర్‌రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఈ క్రమంలో శ్రీధర్‌రెడ్డి నివాసంలో జరిగిన ఉత్తరక్రియలకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి వీరి చలపతిరావు బుధవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా హరిధర్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు చిమటా శేషగిరిరావు, సర్పంచ్ మోచర్ల రమేష్, నాయకులు దేవిరెడ్డి సాయిరెడ్డి, నిరంజన్‌రెడ్డి ఉన్నారు.

# రైతులకు అవగాహన సదస్సు

**పొదలకూరు :** మండలంలోని కనుపర్తి రైతు సేవా కేంద్రంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ ఎ.వాసు మాట్లాడుతూ రైతులు తృణధాన్యాల సాగుపై అవగాహన పెంపొందించుకోవాల్సిందిగా సూచించారు. వరికోతల సమయం ఆసన్నమైందని సాంకేతికత ఆధారంగా కోతలు పూర్తి చేయాల్సిందిగా పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



వరిపైరును రైతులతో కలిసి పరిశీలిస్తున్న ఏఓ వాసు

# చెత్తతో పంచాయతీలకు అదనపు ఆదాయం



అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ శివకుమార్

**మనుబోలు :** చెత్త నుంచి పంచాయతీలు అదనపు ఆదాయం సమకూర్చుకోవచ్చని సైదాపురం ఎంపీడీఓ శివకుమార్ అన్నారు. సైదాపురం మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, క్లాప్ మిత్రలకు మనుబోలులోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో బుధవారం శిక్షణ ఇచ్చారు. చెత్త నుంచి వర్మీ కంపోస్టు ఎరువును ఎలా తయారు చేయాలో చూపించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లలోని చెత్తను సేకరించి దాని నుంచి ప్లాస్టిక్ పదార్థాలను వేరు చేసిన తర్వాత తడి, పొడి చెత్తగా విభజించి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలని సూచించారు. అక్కడ చెత్తలో వానపాములను వదలడం ద్వారా కంపోస్టు ఎరువును తయారు చేయాలని తెలిపారు. దీనిని రైతులకు విక్రయించడం ద్వారా పంచాయతీకి ఆదాయం సమకూర్చుకోవచ్చన్నారు. ఈఓపీఆర్డీ రాఘవేంద్రబాబు ఉన్నారు.

## తొమ్మిది కొనుగోలు కేంద్రాల ఏర్పాటు



ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏఓ

**ముత్తుకూరు :** మండలంలో తొమ్మిది ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మండల వ్యవసాయాధికారి జోత్స్న రాణి అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా దొరువులపాళెంలో ఆమె బుధవారం పర్యటించారు. రైతులు పండించిన వరి ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఏ గ్రేడ్ ధాన్యానికి పుట్టి రూ.19,720ల మద్దతు ధర ఉందన్నారు. రైతులు ఈ–క్రాప్, ఈ–కేవైసీ చేయించుకుని, రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు. మండలంలో 9,400 ఎకరాల్లో వరిసాగు జరుగుతోందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అమ్మకాలు చేసి, మద్దతు ధర పొందాలని సూచించారు.

## మర్యాదపూర్వకంగా..



**నెల్లూరు(బారకాసు):** మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని డైకస్ రోడ్డులోని పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. పలు అంశాలపై వీరు చర్చించారు.

## వేడుకగా ఏకాంతసేవ

**నెల్లూరు(బృందావనం):** మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఏకాంతసేవను జరిపారు. అభిషేకాలు, పూజలు, అర్చనలను నిర్వహించారు. ఉభయకర్తలుగా కృష్ణారావు, పద్మావతి దంపతులు వ్యవహరించారు. ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.



## కసుమూరులో దంపతులపై దాడి

**వెంకటాచలం :** పాతకక్షల నేపథ్యంలో మండలంలోని కసుమూరు గ్రామానికి చెందిన పిల్లి దశయ్య, సుప్రియ దంపతులపై అదే గ్రామానికి చెందిన ఖాదర్‌మస్తాన్ అనే వ్యక్తి దాడి చేశాడు. బాధితుల వివరాల మేరకు.. ఈనెల 2వ తేదీన కసుమూరు గ్రామంలోని తన నివాసంలో సుప్రియ ఒంటరిగా ఉండగా అదే సమయంలో ఖాదర్‌బాషా ప్రవేశించి దాడి చేశాడు. ఆ సమయంలో ఇంటికి వచ్చిన ఆమె భర్తపై కూడా దాడి చేయడంతో బాధితులు వెంకటాచలం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే సదరు వ్యక్తిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరుగుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని బాధితులు బుధవారం వాపోయారు.

## డిగ్రీ పరీక్షలకు 485 మంది గైర్హాజరు

**వెంకటాచలం :** విక్రమ సింహపురి యూనివర్సిటీ(వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల్లో బుధవారం నిర్వహించిన డిగ్రీ నాలుగో, ఆరో సెమిస్టర్ పరీక్షలకు 485 మంది గైర్హాజరయ్యారని వీఎస్‌యూ పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ సీహెచ్.వెంకట్రాయులు తెలిపారు. ఉదయం నిర్వహించిన ఆరో సెమిస్టర్ పరీక్షకు మొత్తం 48 మందికి, 40 మంది హాజరై, 8 మంది గైర్హాజరయ్యారని, మధ్యాహ్నం నిర్వహించిన నాలుగో సెమిస్టర్ పరీక్షలకు 8,230 మందికి, 7,753 మంది హాజరై, 477 మంది గైర్హాజరయ్యారన్నారు.

## కొనుగోలు కేంద్రాల్లో కూపన్ పొందాలి

- డీఏఓ సత్యవాణి



రైతులకు సూచనలిస్తున్న డీఏఓ సత్యవాణి

**కొడవలూరు :** కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించే రైతులు వారం ముందుగా వీఏఏ ద్వారా కూపన్ పొందాలని జిల్లా వ్యవసాయాధికారి(డీఏఓ) పి.సత్యవాణి సూచించారు. కొడవలూరులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. అనంతరం రైతులతో సమావేశమై మాట్లాడారు. కొనుగోలు కేంద్రంలో ఏ–గ్రేడ్ ధాన్యానికి పుట్టికి రూ.19,720లు ఇచ్చామన్నారు. మండలంలో 14 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. రైతులు కొనుగోలు కేంద్రాల ద్వారానే ధాన్యం విక్రయించుకుని మద్దతు ధర పొందాలని కోరారు. అదేవిధంగా రైతులు జియో ట్యాగింగ్ ఉన్న వాహనాల ద్వారానే ధాన్యం రవాణా చేయాలని సూచించారు. ఏడీఏలు సర్వోజి, డి.సుజాత, ఏఓ లక్ష్మి, ఏఈఓ పి.వెంకట్రావు, వీఏఏ జి.కవిత పాల్గొన్నారు.

## వృద్ధులకు వైద్య పరీక్షలు



పొదలకూరు : నర్సారెడ్డి కాలనీలో..



కొడవలూరు: రామన్నపాళెంలో..



కోవూరు : శాంతినగర్‌లో..

**పొదలకూరు :** పట్టణంలోని నర్సారెడ్డి కాలనీలో ఉన్న లక్ష్మి వృద్ధుల ఆశ్రమంలో వైద్యశిబిరాన్ని బుధవారం నిర్వహించారు. మహ్మదాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నరసింహారావు పర్యవేక్షణలో ఆశ్రమంలో ఉన్న వారికి లివర్, గుండె సంబంధ వ్యాధులకు రక్తపరీక్షల కోసం నమూనాలను సేకరించారు. ఈ పరీక్షల ఫలితాలు శుక్రవారం అందుతాయని వైద్యాధికారి వెల్లడించారు. అవసరమైతే స్పెషలిస్ట్ డాక్టర్ల ద్వారా వైద్య సేవలను అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సహాయకులు రాధాకుమారి, సాని శివప్రసాద్, ల్యాబ్ టెక్నీషియన్ మస్తాఫా, ఎంఎల్‌హెచ్‌పీ సుమాంజలి, సచివాలయ ఏఎన్ఎం కృష్ణమ్మ, ఆశావర్కర్లు ఉష, సీత పాల్గొన్నారు.

- **కొడవలూరు:** మండలంలోని రామన్నపాళెంలో ఉన్న డివైన్ ఇండియా వృద్ధాశ్రమంలో కొడవలూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 24 మంది వృద్ధులకు వైద్య పరీక్షలు చేయగా, వారిలో 22 మందికి మధుమేహం, నలుగురికి రక్తహీనత ఉన్నట్లు గుర్తించి మందులు, వైద్య సలహాలిచ్చారు. వైద్యాధికారి ఎం.రామకృష్ణ వైద్యపరీక్షలు చేశారు. మాజీ ఎమ్మెల్సీ బూదాటి రాధయ్య, మాజీ ఉపసర్పంచ్ కె.సుమన్, ఎంఎల్‌హెచ్‌పీ మాప్ జాన్, ల్యాబ్ టెక్నీషియన్ మెర్సీ, హెచ్ఏ షఫీ ఉద్దీన్‌లు పాల్గొన్నారు.
- **కోవూరు :** స్థానిక శాంతినగర్‌లో ఉన్న లక్ష్మీపార్వతి వృద్ధాశ్రమంలో ఇనమడుగు పీహెచ్‌సీ వైద్యాధికారి ఇర్ఫాన్ ఆధ్వర్యంలో బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

# పైప్‌లైన్ పనులను నెలపాటు ఆపండి

- భారత్ పెట్రోలియం సంస్థను అభ్యర్థించిన రైతులు



కంపెనీ ప్రతినిధులతో మాట్లాడుతున్న రైతులు

**తోటపల్లిగూడూరు :** భారత్ పెట్రోలియం సంస్థ రైతుల పంట పొలాల మధ్య ఏర్పాటు చేస్తున్న పైప్‌లైన్ పనులను నెల వరకు నిలుపుదల చేయాలని మండల రైతాంగం అభ్యర్థించారు. కృష్ణపట్నం పోర్టు నుంచి హైదరాబాద్‌కు భారత్ పెట్రోలియం సంస్థ ప్రత్యేక పైప్‌లైన్‌ను ఏర్పాటు చేస్తోంది. మండలంలోని సౌత్ఆములూరు, చింతోపు, ఇస్కపాళెం, పాపిరెడ్డిపాళెం, తోటపల్లిగూడూరు గ్రామాల్లోని పంట భూముల్లో ఈ పైప్‌లైన్ నిర్మాణ పనులను చేపట్టాల్సి ఉంది. ఈ క్రమంలో పేడూరు సమీపంలోని పొలాల మధ్య ఇటీవల పైప్‌లైన్ పనులను చేపట్టారు. అయితే కోతలు దగ్గర పడుతున్న తరుణంలో పనులు చేపట్టడం తగదని స్థానిక రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో ఆ సంస్థ తాత్కాలికంగా పనులను నిలుపుదల చేశారు. అయితే భారత్ పెట్రోలియం సంస్థ ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాలతో వెంటనే పనులు పెట్టాలనే ఆలోచనతో స్థానిక అధికారులు సమాయత్తం అవుతున్నారు. ఈ క్రమంలో కంపెనీ ప్రతినిధులు, అధికారులు బుధవారం తోటపల్లిగూడూరు సచివాలయంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కంపెనీ చేపట్టిన పనులకు రైతులు అడ్డంకులు సృష్టించొద్దంటూ అధికారులు, కంపెనీ ప్రతినిధులు విన్నవించారు. అయితే పంట కోతలు పూర్తయ్యే వరకు నెల పాటు గడువు ఇవ్వాల్సిందేనని రైతులు పట్టుబట్టారు. ఈ విషయంలో కంపెనీ ప్రతినిధులు, రైతుల మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. అయితే నెల పాటు పైప్‌లైన్ పనులు నిలిపి వేస్తే కంపెనీకి తీవ్రనష్టం వాటిల్లే అవకాశం ఉందని, రైతులను ఒప్పించే ప్రయత్నం చేసినా వారు ఒప్పుకోలేదు. అయితే నష్టపోయిన పంటకు పూర్తిస్థాయిలో పరిహారం చెల్లిస్తామని కంపెనీ ప్రతినిధులు హామీ ఇవ్వడంతో రైతులు కాస్త ఆలోచనలో పడ్డారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణప్రసాద్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, మండలాధ్యక్షుడు సన్నారెడ్డి సురేష్‌రెడ్డి, పలువురు రైతు సంఘ నాయకులు పాల్గొన్నారు.

# పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి



ఇందుకూరుపేట : తల్లిదండ్రులకు వివరిస్తున్న అంగన్‌వాడీలు

**ఇందుకూరుపేట :** పిల్లల ఆహారం, ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల అన్నారు. మండలంలోని గంగపట్నం మజరా శ్రీనివాసపురం అంగన్‌వాడీ కేంద్రంలో సంరక్షణ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల ఎత్తు, బరువులను కొలిచి వారి ఆరోగ్య స్థితిపై తల్లిదండ్రులకు తెలియజేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో వారికి అందిస్తున్న పోషకాహారం, అందించే చదువు గురించి వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త స్వరూప, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

- **మనుబోలు :** పిల్లల ఆరోగ్యం విషయంలో తల్లులు జాగ్రత్తతో వ్యవహరించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ అన్నారు. మండలంలోని కాగితాలపూరు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులతో బుధవారం సమావేశమై ఐదేళ్లలోపు చిన్నారుల ఆరోగ్యం, విద్యపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె పలు సూచనలు చేశారు. ఏఎన్ఎం జయరామమ్మ, అంగన్‌వాడీ విజయమ్మ పాల్గొన్నారు.



మనుబోలు : కాగితాలపూరులో..